బాధ్యతారాహిత్యం.. బతుకులు ఛిద్రం

- గురజాల డివిజన్ పరిధిలో రక్తమోడుతున్న రహదారులు
- 41 ప్రమాదాల్లో 27 మంది మృతి
- నిద్రమత్తు, అతివేగం ప్రమాదాలకు ప్రధానం కారణం
- ప్రాణాలు తీస్తున్న రోడ్‌సైడ్ పార్కింగ్ వాహనాలు


రెంటచింతల రోడ్డు ప్రమాదంలో నుజ్జునుజ్జయిన వాహనం (ఫైల్)

గురజాల: కొందరు వాహనదారుల బాధ్యతారాహిత్యం అనేక కుటుంబాల్లో విషాదం నింపుతోంది. నిండు బతుకులను బుగ్గిపాలు చేస్తూ.. రహదారులు రక్తమోడుతున్నాయి. నిబంధనలు పాటిస్తూ.. అప్రమత్తంగా ఉండాలని పోలీసులు, ఇటు రవాణ శాఖ అధికారులు వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నా.. కొందరి డ్రైవర్ల నిర్లక్ష్యం వీడటం లేదు. పరిమితికి మించి ప్రయాణికులను వాహనాల్లో తరలిస్తున్నారు. ఈ క్రమంలో రోడ్డు ప్రమాదం సంభవిస్తే.. పదుల సంఖ్యలో ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. అభంశుభం తెలియని చిన్నారులు, వృద్ధులు, మహిళలు అర్ధంతరంగా తనువు చాలిస్తున్నారు. గుంటూరు హైదరాబాద్, గుంటూరు - మాచర్ల ప్రధాన రహదారుల్లో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఎంతో అప్రమత్తంగా వాహనాలు నడిపితే కానీ, ప్రయాణికులు క్షేమంగా గమ్యస్థానాలకు చేరే పరిస్థితి లేదు. ఇలాంటి రహదారుల్లో ఆటోలు, ట్రాక్టర్లు, జీపుల్లో అధిక సంఖ్యల్లో ప్రయాణికులను డ్రైవర్లు తరలిస్తున్నారు. ఆటోలో 20 నుంచి 30 మందికి తక్కువ కాకుండా రైతు, రోజువారి కూలీలను తీసుకెళ్తున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే అందరి ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసిపోవాల్సిందే.

కేవలం డ్రైవర్ల నిర్లక్ష్యం కారణంగా పల్నాడు ప్రాంతంలో అధిక సంఖ్యలో ప్రమాదాలు జరుగుతున్నాయని పోలీసు అధికారులు చెబుతున్నారు. మద్యం మత్తు, అనుభవంలేని డ్రైవింగ్, పాటించని ట్రాఫిక్ నిబంధనలు ఇందుకు కారణాలుగా చెబుతున్నారు.

ప్రమాదాలు ఇలా...

గురజాల సబ్ డివిజన్ పరిధిలో పిడుగురాళ్ల, దాచేపల్లి, మాచవరం, గురజాల, మాచర్ల, రెంటచింతల, వెల్దుర్తి, దుర్గి, కారంపూడి మండలాలున్నాయి. జనవరి 2023 నుంచి ఇప్పటి వరకు 41 రోడ్డు ప్రమాదాలు జరుగగా.. వాటిలో 27 మంది మృతిచెందారు. 35 మంది గాయపపడినట్లు ఆయా శాఖల అధికారులు వెల్లడించారు. వీటిలో అధిక శాతం అర్ధ రాత్రి, తెల్లవారు జామున జరిగిన ప్రమాదాలే. రోడ్లకు ఇరువైపులా భారీ వాహనాలు నిలుపుదల చేయడం వల్ల.. డ్రైవర్లు నిద్రమత్తులో తమ వాహనాలను వాటిని ఢీకొడుతున్న ఘటనలే ఈ మధ్య అధికంగా కనిపిస్తున్నాయి. రోడ్డు పక్కనే వాహనాలు పార్కింగ్ విషయంలో పోలీసులు, రవాణ శాఖ అధికారులు ఎన్నిమార్లు అవగాహన కల్పించినా కానీ, వారిలో మాత్రం మార్పు రావడం లేదు. అతి వేగంతో వాహనాలను నియంత్రించలేక.. జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు అధికంగా ఉన్నాయి. గతేడాది జూన్‌లో రెంటచింతల గ్రామానికి చెందిన కొంతమంది కూలీలు శ్రీశైలం దైవదర్శనం చేసుకుని తిరిగి వస్తున్న ఆటో ఆగి ఉన్న లారీని ఢీకొన్న ఘటనలో ఏడుగురు కూలీలు మృత్యువాత పడ్డారు. గత బుధవారం మిర్యాలగూడ జిల్లాకు చెందిన కూలీలు ఆరుగురు గురజాల మండలం పులిపాడు గ్రామానికి కూలీ పనులకు వస్తున్న తరుణంలో పొందుగుల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ ప్రమాదాలు అన్నీ ఆటోలు, లారీల మధ్యనే చోటుచేసుకుంటున్నాయి.


పొందుగుల వద్ద ప్రమాదంలో ఆటో దుస్థితి..

హెచ్చరిక బోర్డులున్నా..

ప్రమాదాలు అధికంగా జరుగుతున్న ప్రదేశాలను గుర్తించిన పోలీసు శాఖ.. ఆ ప్రాంతంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసింది. ఈ హెచ్చరిక బోర్డులను వాహనదారులు అస్సలు పట్టించుకోవడం లేదు. కేసులు నమోదు చేస్తున్నప్పటికీ మార్పు రావడంలేదనేది అధికారుల మాట. పల్నాడు జిల్లాలో ప్రతి గ్రామానికి రెండు మూడు ప్రమాదకర ప్రదేశాలను గుర్తించి, ఆ ప్రాంతాల్లో వాహనాలు తక్కువ స్పీడ్‌తో వెళ్లే విధంగా అధికారులు చర్యలు చేపట్టారు.

అవగాహన కల్పిస్తూనే ఉన్నాం



వాహనదారులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నాం. వాహనదారులు పోలీసులకు సహకరించాలి. డ్రైవర్లు మితిమీరిన వేగం, ప్రయాణికులతో వాహనాలు నడపకూడదు. అప్పుడే సగం రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చు.

– డీఎస్పీ ఎ.పల్లపురాజు, గురజాల

'సర్పంచ్' పదవికి వన్నె తేవాలి

ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి


ప్రమాణస్వీకారం కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్లరూరల్: పదవి అనేది బాధ్యతతో కూడుకుందని, అలంకార ప్రాయం కాదని.. పదవికి వన్నె తచ్చే విధంగా సర్పంచ్ పని చేయాలని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. జానపాడు గ్రామ సర్పంచ్‌గా గుడిపుడి వెంకట రమణ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో మంచి పనులు చేస్తూ.. సర్పంచ్ పదవికి మరింత వన్నె తచ్చే విధంగా ఉండాలన్నారు. మండలంలో 17 గ్రామాల్లో 12 గ్రామాలకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వారే సర్పంచ్‌లుగా కొనసాగుతున్నారని గుర్తుచేశారు. ఇది రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కల్పించిన అవకాశమని తెలిపారు. ఇది మంచి పరిపాలన విధానమన్నారు. అందరూ సమానంగా అభివృద్ధి చెందాలనేదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనా విధానం అన్నారు. జానపాడు బ్రిడ్జిని నిర్మించేందుకు నిధులు వచ్చాయని, దీంతో జానపాడుకు ఉన్న కష్టాలు తొలగిపోతాయని తెలిపారు. అనంతరం గ్రామ సెక్రటరీ స్వామినాయక్ గుడిపుడి వెంకట రమణతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ చల్లా పిచ్చిరెడ్డి, వైఎస్ ఎంపీపీ సాతులూరి బాబు, ఉన్నం గ్రూప్స్ అదినేత ఉన్నం నరసింహరావు, ప్రముఖ వైద్యులు ఉన్నం నాగమల్లికార్జునరావు, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ ఎండీ గఫార్, మాజీ మండల వైస్ చైర్మన్ సూరాబత్తుల శ్రీనివాసరావు, సొసైటీ చైర్మన్ ఉన్నం శ్రీనివాసరావు, విద్యా కమిటీ చైర్మన్ మక్కెన వెంకయ్య, మాజీ సర్పంచ్ తాళ్లపల్లి మర్యాదరావు, జ్యోతి, వెంకటేశ్వర్లు, ఖాశీం, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

1,226 మందికి కంటి వైద్య పరీక్షలు


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న చల్లగుండ్ల శ్రీరామమూర్తి

గురజాల: సినీ నటుడు, మాజీ సీఎం ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా చల్లగుండ్ల చారిటబుల్ ట్రస్టు, శంకర కంటి వైద్యశాల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక చల్లగుండ్ల గార్డెన్స్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యుడు చల్లగుండ్ల శ్రీరామమూర్తి శిబిరాన్ని ప్రారంభించారు. 1,226 మందికి పరీక్షలు నిర్వహించి, 532 మందికి కంటి శుక్లాల శస్త్ర చికిత్సకు వైద్యులు రెఫర్ చేశారు. 694 మందికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కంటి వైద్య నిపుణులు అపర్ణ, రూతుజ వైద్య సేవలు అందించారు. బండారు చిరంజీవి, అక్కినపల్లి సైదులు, తన్నేటి బుచ్చిబాబు, శంకర కంటి వైద్య శాల క్యాంపు ఇన్‌చార్జీ సైదులు బాబు, తదితరులున్నారు.

కాళహస్తీశ్వర ఆలయ ముఖద్వారం ప్రారంభం నేడు


ప్రారంభోత్సవానికి సిద్ధమైన సింహద్వారం

రెంటచింతల: పాలువాయి గ్రామంలోని అతి పురాతనమైన శ్రీ గంగా జ్ఞాన ప్రసూనాంబ సమేత కాళహస్తీశ్వర స్వామి దేవస్థానం ముఖద్వారం ప్రారంభోత్సవానికి ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఎంపీ లావుకృష్ణదేవరాయిలు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన ప్రధాన విభాగం కార్యదర్శి పిన్నెల్లి వెంకటరామిరెడ్డి సోమవారం రానున్నట్లు సర్పంచ్ మందలపు విజయలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖద్వారం నిర్మాణాన్ని వైఎస్సార్ సీపీ నాయకులు మందలపు హనిమిరెడ్డి, మందలపు సైదారెడ్డి వారి పూర్వికుల జ్ఞాపకార్థం చేపట్టారు. ఆలయ ప్రధానార్చకులు గార్లపాటి శివప్రసాద్ నేతృత్వంలో ఆగమ శాస్త్ర పండితులు జిగురు చంద్రశేఖరశర్మ, జిరుగు ప్రసాదశర్మ, జిగురు శంకర్‌శర్మ ఉదయం 8.52గంటలకు సింహద్వారం ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం అన్నదానం చేయనున్నారు.

పేదల అభ్యున్నతే సీఎం వైఎస్ జగన్ లక్ష్యం


బుక్‌లెట్ అందజేస్తున్న చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి

వెల్దుర్తి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల అభివృద్ధి కోసం పాటుపడుతున్నారని పల్నాడు జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి అన్నారు. మండల కేంద్రమైన వెల్దుర్తిలో ఆదివారం జరిగిన మా భవిష్యత్తు నువ్వే జగన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తుంటే ఓర్వలేని టీడీపీ నాయకులు అర్థంలేని విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. గ్రామ సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహ సారథులతో కలసి ఆయన గ్రామంలో ఇంటింటికీ తిరిగారు. సంక్షేమ పథకాల లబ్ధిదారులతో మాట్లాడారు. సంక్షేమ పథకాలు ఇలాగే కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మాజీ సర్పంచ్‌లు జూలకంటి నాగిరెడ్డి, కేసిరెడ్డి వెంకటరెడ్డి, పులుసు నారాయణరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు కె.పిచ్చిరెడ్డి, కోట్ల పాపిరెడ్డి, వెంకట్రామిరెడ్డి, శివారెడ్డి, పీటర్‌పాల్, పూర్ణచంద్రారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం


ప్రజలతో మాట్లాడుతున్న సీఐ ఆంజనేయులు

పిడుగురాళ్ల: సమస్యల పరిష్కారమే ధ్యేయమని సీఐ పీవీ ఆంజనేయులు అన్నారు. కరాలపాడు గ్రామంలో ఆయన పల్లె నిద్ర చేశారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే.. చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామంలో సమస్యలుంటే.. వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రబ్బానిఖాన్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో గ్రామాలు ఉండాలి

గురజాల: గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉండాలని, ఎవరైనా విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ ప్రభాకర్ హెచ్చరించారు. ఎస్పీ రవిశంకర్‌రెడ్డి ఆదేశాల మేరకు శనివారం రాత్రి మండల పరిధిలోని దైద, తేలుకుట్ల గ్రామాల్లో పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలతో మాట్లాడారు. గ్రామాల్లో అల్లర్లు సృష్టించ వద్దని, ప్రతి ఒక్కరూ ఆనందంగా జీవితాన్ని గడపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు అశోక్, బి.అనంత కృష్ణ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీనివాసరావు సేవలు మరువలేనివి


శ్రీనివాసరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

మాచర్ల: నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ నాయకులకు, కార్యకర్తల కుటుంబాలకు ఎలాంటి ఇబ్బంది కలిగినా ఆదుకోవడానికి తాను ముందుంటానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. పట్టణంలోని 4వ వార్డులో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పార్టీ నాయకుడు పులిపాటి శ్రీనివాసరావు కుటుంబాన్ని ఆదివారం ఆయన పరామర్శించారు. శ్రీనివాసరావు చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. శ్రీనివాసరావు పార్టీకి చేసిన సేవలను కొనియాడారు. అతని కుమారుడు మహేష్ ఉన్నత చదువుల నిమిత్తం రూ.50 వేల ఆర్థిక సాయాన్ని శ్రీనివాసరావు సతీమణికి అందించారు. వార్డు కౌన్సిలర్లు గట్లా కోటిరెడ్డి, రామిశెట్టి వెంకటేశ్వర్లు, రామాంజనేయరెడ్డి, మంజుల మల్లికార్జునరావు, చంద్రా బాలాజీ, బొమ్మిశెట్టి చినకాశయ్య, శ్రీను, బొమ్మిశెట్టి ప్రసాద్, హైట్ వీరారెడ్డి, జూలకంటి వీరారెడ్డి, కొండా రఘురామిరెడ్డి, ఎం రామకృష్ణారెడ్డి, సాగి శ్రీను, బుల్లెద్దుల శ్రీను పాల్గొన్నారు.

ముగిసిన కళాసాగరి ఉత్సవాలు


ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే బొల్లా తదితరులు

వినుకొండ(నూజెండ్ల): వినుకొండలో కళాసాగరి ట్రస్ట్ నాట్య ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పేర్కొన్నారు. ఉత్సవాలు ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాకారుల్ని ప్రోత్సహించేందుకు సహకారం అందిస్తామని చెప్పారు. త్వరలోనే రాష్ట్ర స్థాయిలో పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఆదివారం నిర్వహించిన నృత్య పోటీల్లో గుంటూరు, ఒంగోలు, నరసరావుపేట, కందుకూరు, వినుకొండ తదితర ప్రాంతాలకు చెందిన 60 మంది బాలలు పాల్గొన్నారు. గణేష్ రత్తయ్య స్మారక ఆదర్శ రైతు సత్కారాన్ని ఉమ్మడివరం గ్రామానికి చెందిన రైతు వీరగంధం రత్తయ్యకు అందజేశారు. అనంతరం డ్యాన్స్ పోటీల్లో విజేతలకు ఎమ్మెల్యే బొల్లా బహుమతులు అంతజేశారు. కార్యక్రమంలో కూచి రామాంజనేయులు, సదాశివరావు, బ్యాంక్ నాగేశ్వరరావు, ముత్తినేని గిరిబాబు, బత్తుల శ్రీనివాసరావు, వై.ఆదిరాములు, జయచంద్రపాల్, కోటి, కమలారాం, చలపతిరావు, జ్యోతి, గుండాల స్వెనోమ్ ,బొల్లా రమేష్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గొప్ప రాజనీతిజ్ఞుడు శ్రీకృష్ణదేవరాయలు


శ్రీకృష్ణదేవరాయలు విగ్రహావిష్కరణలో మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: ఆంధ్ర భోజుడుగా కీర్తి ప్రతిష్టలు పొందిన శ్రీకృష్ణదేవరాయలు గొప్ప రాజనీతిజ్ఞుడని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖా మంత్రి విడదల రజిని కొనియాడారు. పట్టణంలోని భాస్కర్ సెంటర్‌లోని రోడ్డు డివైడర్‌పై శ్రీకృష్ణదేవరాయలు కాంస్య విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించారు. విగ్రహావిష్కరణ అనంతరం మంత్రి మాట్లాడుతూ శ్రీకృష్ణదేవరాయలు పాలనలో విజయనగర సామ్రాజ్యం అత్యున్నత స్థితికి చేరుకున్నట్లు చరిత్ర చెబుతుందన్నారు. తెలుగు, కన్నడ ప్రజలతో పాటు భారత దేశాన్ని పాలించిన గొప్ప చక్రవర్తుల్లో శ్రీకృష్ణదేవరాయలు ఒకరని తెలిపారు. ఆయన విగ్రహ ఏర్పాటు ద్వారా భావితరాలకు ఆయన ఆదర్శాల్ని చేరవేసే అవకాశం కలుగుతుందని వివరించారు. విగ్రహ కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జీడీసీసీ బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి రామాంజనేయులు, విగ్రహ కమిటీ గౌరవ అధ్యక్షుడు తోట రామచంద్రప్రసాద్, అధ్యక్షుడు తోట బ్రహ్మస్వాములు, కమిటీ సభ్యులు గాజుల ఆంజనేయులు, పొన్నం చంద్రశేఖర్, మిరియాల లక్ష్మీనారాయణ, గాలి బుచ్చయ్య, ఇక్కుర్తి పవన్‌కుమార్, వట్టెం శ్రీనివాసరావు, స్థానిక ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

సందడిగా సుబ్బగురు యోగీంద్రస్వామి తిరునాళ్ల


పొంగళ్లు చేస్తున్న భక్తులు

బొల్లాపల్లి : మండలంలోని వెల్లటూరులో సుబ్బగురు యోగీంద్రస్వామి తిరునాళ్ల ఆదివారం ఘనంగా నిర్వహించారు. భక్తులు పొంగళ్లతో నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. దాతలు చిట్టి గోపాలరెడ్డి, కుంటా కోటిరెడ్డి అన్నదానం చేశారు. షిర్డీ సాయి ఆర్థోపెడిక్ హాస్పిటల్ ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. తిరునాళ్ల సందర్భంగా గ్రామంలో నాలుగు భారీ విద్యుత్ ప్రభలు కొలువుతీరాయి. భక్తుల ఉల్లాసం కోసం నిర్వాహకులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

క్లుప్తంగా

కనుల పండువగా శివపార్వతుల కల్యాణం



రెంటచింతల): రెంటచింతలలో వేంచేసిన మల్లికార్జునస్వామి దేవస్థానంలో శివపార్వతుల కల్యాణం ఆదివారం కనుల పండువగా జరిగింది. దేవస్థానం ప్రధాన అర్చకులు వెల్లటూరి నాగేశ్వరశర్మ స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, మల్లెల అర్చన, కుంకుమ పూజ, సహస్రనామార్చన జరిపించారు. అర్చకులు జిగురు ప్రసాద్ శర్మ, జిగురు చంద్రశేఖర్ శర్మ కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు వీక్షించి, తరించారు. మధ్యాహ్నం మహాన్నదానం చేశారు. దేవస్థానం చైర్మన్ పల్లెర్ల లక్ష్మారెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం


ప్రిన్సిపల్ పాపయ్య

జెట్టిపాలెం(రెంటచింతల): జెట్టిపాలెంలోని ఏపీ మోడల్ స్కూల్, కళాశాలలో 2023-24 విద్యా సంవత్సరం ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశానికి ఈ నెల 25 నుంచి జూన్ 7వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని స్కూల్ ప్రిన్సిపల్ కె.పాపయ్య తెలిపారు. ఆదివారం మోడల్ స్కూల్‌లో ఆయన విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ బోధన ఇంగ్లీష్‌లో ఉంటుందని తెలిపారు. ఓసీ, బీసీ, ఈడబ్ల్యూసీ విద్యార్థులు రూ.200, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.150లు ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. 10వ తరగతిలో మెరిట్, రిజర్వేషన్ రూల్స్ ప్రకారం సీట్లు కేటాయించడం జరుగుతందన్నారు. పూర్తి వివరాలకు 91829 58496 నంబరుకు సంప్రదించాలన్నారు.

పాలిసెట్‌లో సత్తా చాటిన దుర్గి విద్యార్థి


కన్నెగంటి ఫణిధర్

దుర్గి: పాలిసెట్ ఫలితాల్లో మించాలపాడు గ్రామానికి చెందిన కన్నెగంటి ఫణిధర్ రాష్ట్ర స్థాయిలో 644 ర్యాంకు సాధించాడు. 120 మార్కులకు గాను 104 మార్కులు తెచ్చుకున్నాడు. విద్యార్థి తల్లిదండ్రులది వ్యవసాయ కుటుంబం. పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 577మార్కులు తెచ్చుకున్నాడు. విద్యార్థి విద్యనభ్యశించిన యాపిల్ ఐఐటీ ఫౌండేషన్ స్కూల్ చైర్మన్ వేముల వెంకటేశ్వర్లు, డైరెక్టర్ లింగా గురవయ్య, ప్రిన్సిపల్ మద్ది అనిల్ కుమార్, కొత్తపల్లి మల్లికార్జున విద్యార్థిని అభినందించారు.

విద్యుత్ సరఫరా లేక ఇబ్బందులు..



దుర్గి: ఇటీవల గాలి వాన బీభత్సం సృష్టించడంతో కంచరగుంట గ్రామంలో విద్యుత్ స్తంభం ఒంగిపోవడంతో.. దీంతో స్థానిక రంగా సెంటర్ ప్రాంతంలోని 20 పైగా గృహాలకు విద్యుత్ సరఫరా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు దృష్టికి సమస్యను తీసుకెళ్లినా నేటికీ పరిష్కారం కాలేదని వారు వాపోతున్నారు. వేసవిలో వడగాల్పులకు పిల్లలు , వృద్ధులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పుకొస్తున్నారు. నీటి మోటార్లు పనిచేయక తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. వెంటనే ఉన్నత అధికారులు కలుగజేసుకొని నూతన విద్యుత్ స్తంభాన్ని నిర్మించి, విద్యుత్తు సరఫరాను పునరుద్ధరించాలని గ్రామస్తులు కోరుతున్నారు. తాళ్ల సాయంతో స్తంభాన్ని గ్రామస్తులు నిలబెట్టారు. ఏ క్షణంలో అయినా..అది కూలే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రౌడీషీటర్లంతా సత్ప్రవర్తనతో మెలగాలి: డీఎస్పీ

నరసరావుపేట: రౌడీషీటర్లు తీరు మార్చుకోవాలని, ప్రజాశాంతికి విఘాతం కల్పిస్తే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ కేవీ మహేష్ హెచ్చరించారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో ఆదివారం డివిజన్ పరిధిలోని రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాలకు పాల్పడినా, ప్రోత్సహించినా ఇబ్బందులు ఎదుర్కొంటారని హెచ్చరించారు. అసాంఘిక కార్యకలాపాలు కొనసాగించే వారిపై పోలీసుల నిఘా నిరంతరమూ ఉంటుందని, సత్ప్రవర్తనతో మెలుగుతూ తీరు మార్చుకొని పోలీసులకు ఇన్ఫార్మర్లుగా వ్యవహరించాలని సూచించారు. గత అనుభవాల్ని మరిచి మళ్లీ తప్పులు చేయకుండా క్రమశిక్షణతో మెలగాలని తెలిపారు. సమాజంలో గౌరవప్రదంగా జీవించాలని, మంచి నడవడికతో మసులుకుంటే రౌడీషీట్ ఎత్తివేస్తామని చెప్పారు. సమావేశంలో సబ్ డివిజన్ సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

25 నుంచి కారెంపూడిలో 'గడప గడపకు'

కారెంపూడి: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఈ నెల 25 నుంచి కారెంపూడిలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ దేవత వీర్ల అంకాలమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలతో ప్రారంభమై.. గ్రామంలో 15 రోజుల పాటు కార్యక్రమం కొనసాగుతుందని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొనాలని తెలిపారు.

నేడు 22వ వార్డులో..

మాచర్ల: పట్టణంలోని 22వ వార్డు పరిధిలోని ఎరుకల కాలనీలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, యువజన విభాగం జోనల్ కో-ఆర్డినేటర్ పిన్నెల్లి వెంకటరామిరెడ్డి సోమవారం సాయంత్రం 5 గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి, కమీషనర్ ఈవీ రమణబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

చిత్రలేఖనం పోటీలు

గురజాల: రాష్ట్ర ప్రభుత్వం గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక గ్రంథాలయ శాఖాధికారిణి హిమభార్గవి కోరారు. ఆదివారం చిన్నారులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. పలు అంశాలపై వారికి అవగాహన కల్పించారు.

క్రీడలతోనే మానసికోల్లాసం

పిడుగురాళ్ల: క్రీడలతోనే మానసికోల్లాసం కలుగుతుందని కౌన్సిలర్ జోగిపర్తి ముక్కంటి అన్నారు. పట్టణంలోని కాసు లోకల్ యూత్ ఆధ్వర్యంలో వైనాట్ 175 క్రికెట్ టోర్నీలో ఆయన పాల్గొన్నారు. క్రీడాకారులతో కరచాలనం చేశారు. టాస్ వేసి మ్యాచ్‌ను ప్రారంభించారు. క్రీడాకారులు సోదర భావంతో ముందుకు నడవాలని సూచించారు. ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు గొట్టిముక్కల పవన్ రెడ్డి, కౌన్సిలర్ బాలస్వామి, రత్నబాబు, టౌన్ యూత్ అధ్యక్షులు మందా సుధీర్, దయాకర్, పుల్లారావు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

పిడుగురాళ్ల: బాలిక అదృశ్యమైన ఘటన పట్టణంలోని చెరువుకట్ట బజారులో చోటుచేసుకుంది. పోలీసులు వివరాల మేరకు.. చెరువుకట్ట బజారుకు చెందిన ఏడుకొండలు కూతురు కంచవు హారిక ఇప్పుడే వస్తానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లింది. ఎంతకీ ఇంటికి తిరిగి రాకపోవడంతో.. స్థానికులు, బంధువుల వద్ద ఆచూకీ కోసం ఎంత వెతికినా ఫలితం లేకపోవడంతో.. పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ ఆంజనేయులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

మదరస్సాకు ఆర్థిక సాయం

చిలకలూరిపేట టౌన్: జ్ఞానేశ్వర ఫౌండేషన్ ద్వారా పేదలకు షేక్ జాన్‌సైదా ఆర్థిక సాయం చేయడం అభినందనీయమని వేలూరు గ్రామ ముస్లిం మత పెద్దలు పేర్కొన్నారు. గత నెలలో రంజాన్ సందర్భంగా నియోజకవర్గంలోని ప్రతి ముస్లింకు తోఫా ఉచితంగా అందజేశారని కొనియాడారు. ఆదివారం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఇస్లాహున్నిసా మదరసాకు జాన్‌సైదా రూ. 50వేలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు సాయం చేయడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉంటామని తెలిపారు.

నిరుపేద బ్రాహ్మణులకు చేయూత

వినుకొండ(నూజెండ్ల): వినుకొండ బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక జీవీ మాధవరావు కార్యాలయంలో నిరుపేద బ్రాహ్మణ కుటుంబాలకు బియ్యం, నూతన వస్త్రాల్ని ఆదివారం పంపిణీ చేశారు. ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ముత్తనపల్లి శివకృష్ణప్రసాద్, లాయర్ గిరిరాజు నాగేశ్వరరావు పాల్గొన్నారు. సేవా సమితి తరపున అనేక సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో చింతలచెర్వు రాఘవేంద్రరావు, చింతలపూడి భద్రయ్య, పుట్టం రాజు బేబీ సరోజిని, నారాయణరావు, భాస్కరరావు, బాబు, విఘ్నేశ్వరి, రామారావు, రవికిరణ్, భువనగిరి సుబ్రహ్మణ్యం, ఎం.వి.శర్మ, నాగేశ్వరరావు, మల్లికార్జునశాస్త్రి పాల్గొన్నారు.

తాటిచెట్టు పైనుంచి పడి యువకుడి మృతి

బొల్లాపల్లి: కాయల కోసం తాటి చెట్టు ఎక్కి కింద పడడంతో తీవ్ర గాయాలపాలై చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని దోమలగుండంలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన పోలేపల్లి ఏసుబాబు (24) సమీపంలోని పొలాల్లో తాటికాయల కోసం చెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తు కింద పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబసభ్యులు తొలుత ఆర్ఎంపీ వద్ద చికిత్స చేయించి, అనంతరం మెరుగైన వైద్యం కోసం వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఏసుబాబు మృతి చెందాడు. మృతునికి భార్య, ముగ్గురు సంతానం ఉన్నారు.